రైతుకు వెన్నుదన్ను వైఎస్సార్‌సీపీనే

అడుగడుగునా ఆంక్షలు..
అయినా ఆగని కార్యకర్తలు, రైతులు

భీమవరం: రైతులకు అండగా ఉండేందుకు శాంతి యుతంగా నిర్వహించే వైఎస్సార్‌సీపీ అన్నదాత పోరు కార్యక్రమాన్ని ప్రభుత్వం అప్రజాస్వామికంగా పోలీస్ వ్యవస్థతో అడ్డుకునే ప్రయత్నం దారుణమని కూటమి ప్రభుత్వానికి రైతన్నలు త్వరలోనే బుద్ధిచెబుతారని వైఎస్సార్‌సీపీ నాయకులు హెచ్చరించారు. భీమవరంలో మంగళవారం నిర్వహించిన అన్నదానపోరు కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకోడానికి చేసిన ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎరువులు కొరతతో రైతులు ఇబ్బందులు పడుతుండడంతో వారికి అండగా ఉండి కూటమి ప్రభుత్వం మెడలువంచి ఎరువులు ఇప్పించేందు అన్నదాతపోరు కార్యక్రమం చేపట్టగా భీమవరం నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు, రైతులు రాయలం గ్రామంలోని నియోజకవర్గ సమన్వయకర్త చినమిల్లి వెంకటరాయుడు ఇంటివద్దకు పెద్దసంఖ్యలో చేరుకున్నారు. అక్కడి నుంచి భీమవరం పట్టణంలోని మునిసిపల్ కార్యాలయ ఆవరణలోని ఆర్డీవో కార్యాలయానికి చేరి వినతిపత్రం అందించాలని నాయకులు సిద్ధమయ్యారు. అయితే భీమవరం టుటౌన్ సీఐ జి కాళీచరణ్ నేతృత్వంలో పోలీసులు అక్కడకు చేరుకుని పెద్ద సంఖ్యలో ప్రదర్శనగా వెళ్లడానికి అభ్యంతరం చెప్పారు. దీంతో సమన్వకర్త వెంకటరాయుడు, పార్టీ మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షులురాలు గూడూరి ఉమాబాల తదితరులు తాము శాంతియుతంగా కార్యక్రమం నిర్వహిస్తామని నచ్చచెప్పడంతో కొంతమందితో మాత్రమే వెళ్లాలని అనుమతిచ్చారు. వెంకటరాయుడు ఇంటి వద్ద నుంచి పార్టీ శ్రేణులు రైతులకు పూర్తి స్థాయిలో ఎరువులు అందించాలి, పంట బీమా వర్తింపుచేయాలి, ఇన్‌పుట్‌ సబ్సిడీ ఇవ్వాలంటూ పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ ప్రదర్శనగా భీమవరం చేరుకున్నారు. మునిసిపల్ కార్యాలయానికి వెళ్లే రోడ్డులో పోలీసులు బారికేడ్స్ ఏర్పాటు చేసిన నాయకులను నిలువరించారు.



భీమవరంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో అన్నదాతపోరు కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ శ్రేణులు



భీమవరంలో ఆర్డీవో కార్యాలయంలోనికి వెళ్లేందు ప్రయత్నిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు



భీమవరం ఆర్డీఓ కార్యాలయం వద్ద వినతి పత్రం అందజేసేందుకు ఆకివీడు నుంచి పెదమిరం పార్టీ కార్యాలయంకు వెళ్లిన నాయకులు

ముఖ్యనాయకులను మాత్రమే ఆర్డీవో కార్యాలయానికి వెళ్లడానికి అనుమతించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, పార్టీ భీమవరం, ఉండి సమన్వయకర్తలు చినమిల్లి వెంకటరాయుడు, పీవీఎల్ నర్సింహరాజు, వైఎస్సార్ సీపీ ఆక్వా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురామ్, గూడూరి ఉమాబాల, కామన నాగేశ్వరరావు మాట్లాడుతూ గతంలో వ్యవసాయం దండగన్న చంద్రబాబునాయుడు రైతులకు పూర్తి స్థాయిలో ఎరువులు అందించకుండా వ్యవసాయాన్ని దండగచేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రానికి అన్నంపెట్టే అన్నదాతలకు అన్నం లేకుండా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎరువులను కూటమి పార్టీల నాయకులు బ్లాక్‌మార్కెట్‌లో అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను అమలుచేయలేని కూటమి ప్రభుత్వం కనీసం రైతుల అవసరాలను కూడా తీర్చలేకపోతుందని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీనాయులు మేడిది జాన్సన్, ఏఎస్ రాజు, భీమవరం పట్టణం, వీరవాసరం మండల అధ్యక్షుడు గాదిరాజు రామారాజు, చవాకుల సత్యనారాయణ, పార్టీ యువజనవిభాగం జిల్లా అధ్యక్షుడు చిగురుపాటి సందీప్, పాలవెల్లి మంగ, నంద్యాల సీతారామయ్య, బొల్లెంపల్లి శ్రీనివాసచౌదరి, ఇంటి సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్, అల్లూరి రవిరాజు, బడుగు అశోక్, కడలి శ్రీరాములు, మునగాల నర్సింహమూర్తి, వీరవల్లి ప్రవీణ్, రాయవరపు శ్రీనివాస్, లక్కు త్రిమూర్తులు, చిరుగుపాటి రాజు, ఉయ్యూరు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

విజయవంతమైన అన్నదాత పోరు

ఆకివీడు: రైతన్నలకు వెన్ను దన్నుగా వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ అండగా ఉందని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నంద్యాల సీతారామయ్య అన్నారు. భీమవరం ఆర్డీఓ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాకు ఆకివీడు మండలం నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమయ్యే యూరియాను కూడా అందజేయలని స్థితిలో ప్రభుత్వం ఉందని ఆరోపించారు. పంటలకు సకాలంలో ఎరువులు వేయకపోతే దిగుబడులు తగ్గిపోతాయన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించడంలేదన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు(యండగండి శ్రీను), మంతెన సునిల్ కుమార్ వర్మ, అద్దంకి ప్రసాద్, కమతం మహేష్, గుండా సుందర రామనాయుడు, మన్నే పోతరాజు, ఎండీ.జహంగీర్, పడాల శ్రీనివాసరెడ్డి, గేదల అప్పారావు, కతారి కేశవరావు, పాశం నర్సింహం, ఇంటి సత్యనారాయణ, పళ్ళెం పండు, కేశిరెడ్డి దిలీప్, కుర్రెళ్ల పాలు, మేడవరపు బుజ్జి, నిమ్మల ద్వారకా, ఊడిగ శ్రీనివాస్, చిగురుపాటి చిట్టిబాబు, ఎరిచర్ల గ్లాడ్‌సన్, కటికత సువర్ణరాజు, ఎస్కే.మాబూ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతను ఆదుకోవాలి



పీవీఎల్ ఆధ్వర్యంలో అన్నదాత పోరుకు తరలివెళ్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కాళ్ల: అన్నదాతను అన్ని విధాల ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ ఉండి నియోజకవర్గ ఇన్చార్జ్ పీవీఎల్ నరసింహరాజు డిమాండ్ చేశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వైఎస్సార్ సీపీ తలపెట్టిన అన్నదాత పోరుకు పెద్ద సంఖ్యలో ఆపార్టీ శ్రేణులు మంగళవారం ఆర్డీవో కార్యాలయానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఉండి ఇన్చార్జ్ పీవీఎల్ నరసింహరాజు మాట్లాడుతూ కూటమి పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం రైతులను మోసం చేసిందని తెలిపారు. యూరియా కూడా అందించలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పక్షాన వైఎస్సార్ సీపీ నిలబడుతుందని తెలిపారు. నేడు కుటమి ప్రభుత్వం అబద్దాల హామీలతో అధికారంలోకి వచ్చి రైతులను నట్టేట ముంచుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

భీమవరం: మాదకద్రవ్యాల అలవాటుతో భవిష్యత్ నాశనమవుతుందని మాదకద్రవ్యాల నివారణకు సమష్టిగా కృషి చేద్దామని ఎక్సైజ్ అండ్ ప్రోహిబిషన్‌శాఖ భీమవరం ఎస్ఐ పీవీవీ ఉమామహేశ్వరరావు అన్నారు. భీమవరం డీఎన్నార్ కళాశాల క్రీడా మైదానంలో ఎక్సైజ్ శాఖ, వాకర్స్ అసోసియేషన్, మార్నింగ్ కాఫీ క్లబ్, ఈగల్ సెల్ ఆధ్వర్యంలో డ్రగ్స్ అనర్థాలపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాల వినియోగం వల్ల యువత భవిష్యత్ నాశనమవుతుందని కొంత మంది యువత డ్రగ్స్‌కు అలవాటుపడడం వల్ల వారి కుటుంబాలు కూడా రోడ్డుపడుతున్నాయన్నారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె పల్లారావు, ఆర్ సీతారామరాజు, మార్నింగ్ కాఫీ క్లబ్ కన్వీనర్ బొండా రాంబాబు మాట్లాడుతూ మాదకద్రవ్యాల విద్యార్థులు, యువత దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, డీఎన్నార్ కళాశాల అసిస్టెంట్ సెక్రటరీ బోసురాజు, భట్టిప్రోలు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



భీమవరం మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ర్యాలీ దృశ్యం

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): భవ్య భీమవరం కార్యక్రమంలో భాగంగా కాస్మోపాలిటన్ క్లబ్ సహకారంతో చేపట్టిన వంశీకృష్ణ పార్క్ అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. అభివృద్ధి పనులు ఏ విధంగా జరుగుతున్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వంశీకృష్ణ పార్కు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పార్కు నందు వాకింగ్ ట్రాక్, పిల్లలు ఆడుకునే గేమ్స్ ఎక్విప్మెంట్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంలో మున్సిపల్ కమిషనర్ కె. రామచంద్రారెడ్డి, మున్సిపల్ డిఇ టి.త్రినాథ్‌రావు, వై శ్రీనివాస్, సిటీ ప్లానర్ లక్ష్మి, కాస్మోపాలిటన్ క్లబ్ అధ్యక్షుడు పద్మరాజు, తదితరులు ఉన్నారు.



పార్కు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తు

ఆకివీడు: మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ అప్లికేషన్స్ సబ్జెక్టు బోధించేందుకు అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కే.సుజాత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 55 శాతం మార్కులతో ఎంఎస్‌సీ కంప్యూటర్ సైన్సు, ఎంటెక్ కంప్యూటర్స్ లేదా ఎంసీఏ పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. సబ్జెక్ట్‌లో నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ నెల 12వ తేదీ లోపు దరఖాస్తుల్ని కళాశాల కార్యాలయంలో అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కాళ్ల: నీటిలో పనిచేసే వారికి చర్మవ్యాధులు సోకే అవకాశం ఉందని తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రముఖ చర్మవ్యాధుల నిపుణురాలు డాక్టర్ ప్రియాంక వర్మ తెలిపారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో కాళ్ల మండలం పెదఅమీరంలో ఉచిత చర్మవ్యాధుల వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక వర్మ మాట్లాడుతూ ఇటీవల కాలంలో నీటిలో పనిచేసే వారిలో ఎక్కువగా తామర వ్యాధి దాదాపు 20 శాతం మంది మధ్య ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ముందు జాగ్రత్తగా చేతికి గ్లౌజెస్ ఉపయోగిస్తే కొంత వ్యాధి దరిచేరకుండా చూడవచ్చునని పలు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రియాంక వర్మ

రైతులందరూ ఈ–పంటను నమోదు చేసుకోవాలి

భీమవరం అర్బన్: సాగులో ఎరువులు ఎంత తక్కువగా వినియోగిస్తే రైతులకు, రాష్ట్రానికి అంతగా ప్రయోజనం చేకూరుతుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. భీమవరం మండలంలోని యనమదుర్రు గ్రామంలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి హాజరై మాట్లాడారు. ఈ పంట నమోదు, అధిక ఎరువులు వినియోగం, అనర్థాలు, పీఎమ్ ప్రణామ్ తదితర కార్యక్రమాలపై రైతులకు అవగాహన కల్పించారు. తొలుత ఈ పంట నమోదు కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్వయంగా పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యవసాయశాఖాధికారి జెడ్ వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కేపీఎస్ఎస్ శ్రీనివాసరావు, ఏవోలు వైవీఎస్ ప్రసాద్, జెడ్ బాల నాగేశ్వరమ్మ, సర్పంచ్ బి. రామమూర్తి, ఎంపీడీవో ఎమ్ మురళీ గంగాధరరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



యనమదుర్రులో ఈ పంట నమోదును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

గాంధీ జయంతి సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

భీమవరం: మహాత్మాగాంధీ 156వ జయంతిని పురస్కరించుకుని సర్వోదయ మండలి ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థాయిలో పాఠశాల, కళాశాల విద్యార్థులకు గాంధీతత్వం–నేటి భారతం అనే అంశంపై చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు సర్వోదయమండలి జిల్లా కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. చిత్రాలను డ్రాయింగ్ షీట్‌పై వేసి ఈనెల 25వ తేదిలోపుగా ఆన్‌లైన్‌లో పంపించాలన్నారు. సీనియర్, జూనియర్, సబ్‌జూనియర్ విభాగాల్లో విజేతలకు అక్టోబర్ 2వ తేదిన గాంధీ జయంతి సందర్భంగా బహుమతులు అందజేస్తామన్నారు. ఇతర వివరాల కోసం సెల్: 99490 93115 నంబర్‌కు సంప్రదించాలని ప్రసాదరాజు తెలిపారు.

ఆడ పిల్లలు బాగా చదువుకోవాలి

భీమవరం (ప్రకాశంచౌక్): ఆడపిల్లలు, మహిళలు సమాజంలో వివక్షకు దూరం కావాలంటే విద్యతోనే సాధ్యమని ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి అన్నారు. జిల్లా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ శక్తి కార్యక్రమంలో భాంగా మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణ పరిధిలోని పని శాఖల మహిళా ఉద్యోగులు, విద్యార్థుల, డ్వాక్రా మహిళలు, అంగన్‌వాడీ వర్కర్స్ పాల్గొన్నారు. ముందుగా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ లోకమాన్ మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల మహిళలు వారికిచ్చే లోన్స్‌తో స్వయం ఉపాధి సాధించి ఆర్థికంగా ఎదగాలన్నారు. తమ సంస్థ ద్వారా ఇచ్చే ట్రైనింగులు గురించి వివరించారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ తరపున నడపబడుచున్న వివిధ శాఖల పని తీరును గురించి వివరించారు. శిశు గృహ దత్తత, డీసీపీఓ యూనిట్ వన్ స్టాప్ సెంటర్ ఈ సేవలన్నీ మహిళలు అత్యవసర సమయాల్లో ఎలా ఉపయోగించుకోవాలో తెలియజేశారు. కిశోర బాలికలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కిశోరి బాలికలు, మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్ వైజర్లు తదితరులు పాల్గొన్నారు.



న్యూ సంకల్ప కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి

పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా ఉండాలి

వీరవాసరం: మండలంలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా ఉండాలని డీపీఓ ఎన.రామనాథరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం మడుగు పోలవరం గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. అనంతరం రాయకుదురు గ్రామపంచాయతీ సందర్శించి స్వమిత్వ సర్వేలో జరుగుతున్న వెక్టరైజేషన్ పనులు పరిశీలించి నిరుపయోగంగా ఉన్న మంచినీటి చెరువు పరిశీలించి సర్పంచ్ ఎంపీటీసీలు గ్రామ పెద్దలతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం చింతలకోటి గరువు గ్రామపంచాయతీ సందర్శించి మంచినీటి చెరువు డంపింగ్ యార్డ్ పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ అప్పారావు, సర్పంచులు గెడ్డం భారతి, చికిలే మంగతాయారు, నూకల సూర్యనారాయణ, అడ్డాల రాము, తోట బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



రాయకుదురులో చెరువును చూస్తున్న డీపీఓ

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

భీమవరం: ముఖ్యమంత్రి సహాయ నిధి వైద్యపరంగా ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నా రు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం భీమవరం నియోజకవర్గంలోని 31 మంది లబ్ధిదారులకు రూ 21.17 చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

కార్మికులకు ఈఎస్ఐ సేవలు అందించాలి

పాలకొల్లు సెంట్రల్: ప్రభుత్వం రైస్ మిల్లు కార్మికులకు, ఇతర కార్మికులకు ఈఎస్ఐ సేవలు అందించాలని రైస్‌మిల్లు కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వాసుదేవరావు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో ఓ రైస్ మిల్లు కార్మికులతో మాట్లాడుతూ వారి సమస్యలు తెలుసుకున్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం

భీమవరం (ప్రకాశంచౌక్): క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్యాధికారి డా.జి.గీతాబాయి తెలిపారు. భీమవరం ఏరియా ఆసుపత్రిలో ఎన్‌సీడీ 4.0సర్వేలో నాలుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సీహెచ్‌ఓలకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.లక్ష్మణ్ జీతానంద్ మాట్లాడుతూ ఈ సర్వేలో క్యాన్సర్‌నీ ముందుగానే గుర్తించి సరైన వైద్యం అందించవచ్చు అని పేర్కొన్నారు. క్యాన్సర్ స్క్రీనింగ్ పై అవగాహన కల్పిస్తూ దానికి సంబంధించిన శిక్షణ నాలుగు పీహెచ్‌సీలకు అందజేయడం జరిగిందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. కే. ఎం.ఆర్ కిషోర్, పివో యూ నోడల్ ఆఫీసర్ డా .శ్రీలలక్ష్మి, జిల్లా టిబీ ఆఫీసర్ డా.రవి, డా. మౌనిక, డా. భారతి ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



సీహెచ్‌ఓలకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

నేడు బదిరోన్నత పాఠశాల 40వ వార్షికోత్సవం

భీమవరం: పట్టణంలోని శ్రీవెంకటేశ్వర బదిరోన్నత పాఠశాల 40వ వార్షికోత్సవ వేడుకల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సంఘం గౌరవాధ్యక్షుడు చెరుకువాడ రంగసాయి, అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ శ్రీనివాసశర్మ, సీహెచ్ తాతారావు తెలిపారు. మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ వార్షికోత్సవాన్ని బుధవారం డీఎన్నార్ కళాశాలలోని రామకృష్ణ సభా భవనంలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో వార్షికోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు, కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాజ్యసభ సభ్యుడు పాక వెంకట సత్యనారాయణ, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు), డీఎన్నార్ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు గోకరాజు వెంకట నర్సింహరాజు, గాదిరాజు సత్యనారాయణరాజు పాల్గొంటారని తెలిపారు.

చెరుకువాడలో పొలం పిలుస్తోంది



చెరుకువాడ పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులు

ఉండి: మండలంలోని చెరుకువాడలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి ఎన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వరిసాగులో వాడే సాధారణ యూరియా, నానో యూరియాలపై రైతులకు వివరించారు. ప్రస్తుతం సాధారణ యూరియా మండలంలోని సొసైటీల ద్వారా 120 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. అలాగే సాధారణ యూరియా కంటే నానో యూరియా ఉత్తమంటూ తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు గంగాధర్, త్రిమూర్తులు, మల్లేశ్వరరావు, గంగయ్య రైతులు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సొసైటీలకు త్రిసభ్య కమిటీల నియామకం

వీరవాసరం: మండలంలోని నాలుగు సొసైటీలకు త్రిసభ్య కమిటీలను మంగళవారం ప్రభుత్వ ఉత్తర్వులు ద్వారా ప్రకటించారు. వీరవాసరం పీఏసీఎస్ ఛైర్మన్‌గా వీరవల్లి శ్రీనివాసరావు, సభ్యులుగా దూసనపూడి శ్రీనివాసరావు, బండారు మణికంఠ బ్రహ్మానందం ను ఎంపిక చేశారు. మత్స్యపురి పీఏసీఎస్ ఛైర్మన్‌గా పుప్పాల వీర వెంకట నరసింహారావు, సభ్యులుగా కత్తుల పద్మారావు ,చింతపల్లి వెంకటేశ్వరరావును ఎంపిక చేశారు. అండలూరు ఎల్ఎస్‌సీఎస్ ఛైర్మన్‌గా ఎరకరాజు గోపాలకృష్ణంరాజు, సభ్యులుగా తమ్మినేడి సూర్యనారాయణ, బోగిరెడ్డి శ్రీనివాసరావును ఎంపిక చేశారు. రాయకుదురు ఎల్ఎస్‌సీఎస్ ఛైర్మన్‌గా తోట విజయ్ కుమార్ (బుజ్జి), సభ్యులుగా పంజా శ్రీనివాసరావు, జుత్తిగ వెంకట సత్యనారాయణలను ఎంపిక చేశారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

భీమవరం అర్బన్: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం మండలంలోని తోకతిప్ప గ్రామంలో మంగళవారం ఎంపీపీ నిధులు రూ.18 లక్షలతో నిర్మించిన పంచాయతీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ గ్రామాలలో రోడ్లు, డ్రెయినేజీలు నిర్మిస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు మాట్లాడుతూ తోకతిప్ప, లోసరి గ్రామ పంచాయతీలకు కలిపి సచివాలయం ఉండటంతో పాలనకు కొంతమేర ఇబ్బందులు ఉన్నాయన్నారు. పంచాయతీ కార్యాలయం నిర్మించడం వల్ల అధికారులు, గ్రామస్తులు లోసరి వెళ్లకుండా ఇక్కడే పనులు ముగించకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త తోట సీతారామలక్ష్మి, కోళ్ల నాగేశ్వరరావు, సర్పంచ్ తిరుమాని వరలక్ష్మి తదితరులు ఉన్నారు.

మూడు చక్రాల వాహనాల పంపిణీ నిబంధనలు మార్చాలి



అల్లాడి నటరాజు

ఆకివీడు: దివ్యాంగులకు ప్రభుత్వం మంజూరు చేసే మూడు చక్రాల పెట్రోల్ వాహనాల నిబంధనల్లో మార్పులు చేయాలని వికలాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లాడి నటరాజు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన ఒక ప్రకటనలో వయస్సు మీద పడే కొలది దివ్యాంగుల పరిస్థితి మరీ ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. 45 సంవత్సరాల నిబంధనను 55 సంవత్సరాలకు సడలించాలని, 60 శాతం వైకల్యం కలిగిన వ్యక్తులకు ఇవ్వాలని, విద్యార్హతతో సంబంధం లేకుండా పంపిణీ చేయాలని కోరారు. ప్రతి నియోజకవర్గానికి 10 కేటాయించడం వల్ల ఉపయోగంలేదని, దివ్యాంగుల్ని దృష్టిలో పెట్టుకుని నియోజకవర్గానికి 30 స్కూటీలు ఇవ్వాలని నటరాజు విజ్ఞప్తి చేశారు. కాళ్లు, చేతులు లేకుండా పాకుతున్నవారికి, కృత్రిమ అవయవాలు వాడుతున్నవారికి, పోలియో కాలిపర్స్, చంక కర్రలు వాడుతున్నవారికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పంపిణీ రోజే రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేసి, వారిని సంతృప్తి పరచాలని నటరాజు కోరారు.

శక్తీశ్వరస్వామి సేవలో కలెక్టర్ నాగరాణి



యనమదుర్రులో శక్తీశ్వరస్వామివారిని దర్శించుకుంటున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని యనమదుర్రు గ్రామంలో ఎంతో పురాతన దేవాలయమైన పార్వతి సమేత శక్తీశ్వరస్వామి వార్లను మంగళవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి దర్శించుకున్నారు. ముందుగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణికి ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు కొడమంచిలి తమ్మిరాజు, మద్దిరాల సత్యనారాయణలు శ్రీ శక్తీశ్వర స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వదాన్ని, స్వామివారి జ్ఞాపికను జిల్లా కలెక్టర్ నాగరాణికి అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ రావి రాంబాబు, వ్యవసాయ సహాయ సంచాలకులు కె. శ్రీనివాసరావు, ఏంఏఓ శ్రీనివాస్, వీఆర్వో నాగరాజు, పంచాయతీ సెక్రటరీ పి. వీర్రాజు తదితరులు ఉన్నారు.

మత్తు మందులపై అప్రమత్తంగా ఉండండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): మత్తు మందులు శరీరాన్ని, మనస్సును నాశనం చేస్తాయని దేవి ఎడ్యూకేషనల్ సొసైటీ దీక్ష డ్రగ్ ఎడిక్షన్ సెంటర్ సైకాలజిస్ట్ టి.గంగాధర్ పేర్కొన్నారు. డ్రగ్స్ నివారణపై సొసైటీ వారిచే మంగళవారం యాగర్లపల్లిలోని ఆటో డ్రైవర్లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ మత్తు మందులు, ఇతర వ్యసనాలు భారీన పడితే కుటుంబ జీవితం నాశనం అవుతుందని, ఆర్థిక పరిస్థితులు దెబ్బతింటాయని చెప్పారు. ఆరోగ్యకరమైన జీనవ శైలిని పాటిస్తే చెడు అలవాట్లు దరిచేరవన్నారు. వాటి నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని చెప్పారు.